ఐదవ తరగతిలో ప్రవేశానికి అడ్మిషన్లు

అబిడ్స్, జనవరి 27: హుమాయున్ నగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ ఆసిఫ్‌నగర్ బాయ్స్-1 స్కూల్‌లో 5వ తరగతిలో ప్రవేశానికి 2024-25 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 5వ తరగతిలో మైనారిటీలకు 26 సీట్లు, క్రిష్టియన్లకు-2, జైన్స్, పార్సీ, బుద్ధ, సిక్కులకు-2, ఎస్సీలకు-2, ఎస్టీలకు-2 బీసీలకు-5, ఓసీలకు-1 మొత్తం 40 సీట్లు ఉన్నట్లు ప్రధానోపాధ్యాయుడు తాజుద్దీన్ తెలిపారు. వివరాలకు 7331170795, నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ ఆత్మహత్య..

కాచిగూడ,జనవరి 27: అనుమానాస్పదస్థితిలో రైల్వేస్టేషన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కింద గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం.. గుర్తుతెలియని మహిళ(35) శనివారం అనుమానాస్పదస్థితిలో శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-1లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కింద ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మహిళ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతిరాలి ఒంటిపై నీలి రంగు చుడీదార్ ధరించి ఎత్తు. 5.3 ఉన్నట్లు తెలిపారు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతి వేగం.. అంతిమ ప్రయాణమే..

● బేగంపేట ట్రాఫిక్ పోలీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు

కవాడిగూడ, జనవరి 27: అతి వేగంతో వాహనం నడిపితే అంతిమ ప్రయాణం అవుతుందని బేగంపేట ట్రాఫిక్ పోలీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ జి. శంకర్ రాజు అన్నారు. ఈ మేరకు శనివారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా దోమలగూడ ఏవీ కళాశాల ఆర్ట్స్, సైన్స్, కామర్స్ , భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్, నెహ్రూ యువకేంద్ర సంగీతం హైదరాబాద్, యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ సహకారంతో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట హైదరాబాద్, సిబ్బంది ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న బేగంపేట ట్రాఫిక్ పోలీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ జి. శంకర్ రాజు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి వేగంతో వాహనం నడపటం ప్రమాదకరమని, వారి కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొంటున్నాయన్నారు. చాలా మంది యువత అతి వేగంతో వాహనాలు నడిపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తే రూ. వేయ్యి జరిమానా కట్టాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యంగా కాలేజీలో ఈవ్ టీజింగ్ చేయరాదని అన్నారు. అనంతరం ఏవీ కళాశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. పద్మ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, జిల్లా యువజన అధికారి ఖుష్బుగుప్తా, బేగంపేట, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు వి. రాంచందర్, వీరేశం, హెచ్‌జీ అధికారి పీఎస్ కృష్ణ, హీరో మోటో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల విజేతలకు బహుమతులు అందజేత

అడిక్‌మెట్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నేత కె.సురేందర్, అనూరాధల ఆధ్వర్యంలో విద్యార్థినులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ చిరంజీవి, బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ, నేత శ్రీనివాస్, మాధవి, అబ్బు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – ముషీరాబాద్, జనవరి 27

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ, జనవరి 27:రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిం ది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ(55)కాచిగూడ-మలక్‌పేట రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతోఅక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతిరాలి ఒంటిపై ఆకుపచ్చ రంగు చీర, నీలి రంగు జాకెట్ ధరించి, ఎత్తు 5.1 ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని కోరారు.

బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

రవీంద్రభారతి, జనవరి 27: 56 శాతం ఉన్న బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు నామినేటెడ్ చైర్మన్‌లు, డైరెక్టర్ పదవులు ఇవ్వాలని జాతీయ బీసీ మహిళా సమాఖ్య ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్మన్ ఎం. భాగ్యలక్ష్మి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవీంద్రభారతిలో మార్చి 5వ తేదీన 'ఓబీసీల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు శనివారం ఆమె తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఓబీసీల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి బీసీలను చైతన్యం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఓబీసీల ఆత్మీయ సమ్మేళనం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంజులతాయాదవ్, శ్రీకాంత్‌లాల్, చిన్నయ్య, రవికుమార్, జయప్రకాశ్, యాదయ్యగౌడ్, మాధవి, పద్మ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనిధి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్మన్ ఎం. భాగ్యలక్ష్మి

ఫార్మాసిస్ట్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కుర్మ శంకర్, గౌరవ అధ్యక్షుడు నల్ల సోమమల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ వడ్డేరాజ్, కోశాధికారి శిలిష, కార్యనిర్వాహణ కార్యదర్శి వీరేశ్‌బాబు, అమృత్‌రావు, సలహాదారులు పాండు, ప్రభాకుమార్, భాస్కర్, కార్యవర్గ సభ్యులు వాసు, నాగరాజు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, జనవరి 27



గవర్నర్ కోటాలో ఎంఎల్‌సీగా ఎన్నికైన 'సియాసత్ ఉర్దూ పత్రిక' ఎడిటర్ అమీర్‌అలీఖాన్‌ను శనివారం టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, సభ్యులు మహ్మద్ నసీరుద్దీన్, వికాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. – సుల్తాన్‌బజార్, జనవరి 27

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లోని తారామతి బారాదరిలో శనివారం మణికొండకు చెందిన శ్రీగాయత్రి ఈటెక్నో పాఠశాల 11వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొంపల్లి మధుసూదన్, డైరెక్టర్లు సమిఉద్దీన్, విజయ్, అడ్వకేట్ కీర్తి ప్రభాకర్, ఎస్‌సీఆర్ఇటీ అధికారి సురేశ్, నీఈఓ సర్వేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ రచన, మేనేజర్ హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. – మెహిదీపట్నం, జనవరి 27

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా అల్యూమిని క్లబ్ జోన్ చైర్మన్‌గా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీవీఎన్ రాజు శనివారం ఆ సంస్థ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ సలహాదారు సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వినయ్‌మోహతా, నేషనల్ డైరెక్టర్ మనోజ్‌తక్కర్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి జీవీఎస్ రాజును అభినందించారు. – ముషీరాబాద్, జనవరి 27

కేంద్ర ప్రభుత్వ ఆమోదిత మినిస్ట్రీ ఆఫ్ కంజూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిభూషన్ తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యురాలిగా ఇటీవల ఎన్నికైన ఎన్.వరలక్ష్మిని శనివారం కాచిగూడలో సన్మానిస్తున్న సుందరయ్య పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రతినిధులు. – కాచిగూడ, జనవరి 27

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తిచేయాలి

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. నింబోలిఅడ్డాలోని డ్రైనేజీపైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఫిర్యాదు మేరకు శనివారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, మల్లికార్జున్, భీంరాజ్, రవియాదవ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ, జనవరి 27

నాంపల్లి నియోజకవర్గం మల్లెపల్లికి చెందిన మిన్హాజ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల చెక్‌ను శనివారం లబ్ధిదారురాలి కుటుంబసభ్యులకు నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అందజేశారు. – మెహిదీపట్నం జనవరి 27

ఆదర్శవంతమైన డివిజన్‌గా గోల్నాక

కాచిగూడ, జనవరి 27: గోల్నాక డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం ఎస్సీ హాస్టల్‌లైన్‌లో పాదయాత్ర చేసి డైనేజీ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ సమస్యను పరిష్కారించాలని జలమండలి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

ఐటా అండర్-18 టైటిల్ విజేత సాయిఅనన్య

అంబర్‌పేట, జనవరి 27 : ఆల్‌ఇండియా టెన్నిస్ అసోసియేషన్(ఐటా) అండర్-18 టైటిల్‌ను నల్లకుంటకు చెందిన టెన్నిస్ ప్లేయర్ సాయిఅనన్య వారణాసి గెలుపొందింది. కోయంబత్తూర్‌లో నిన్న జరిగిన ఈ పోటీల్లో తమిళనాడుకు చెందిన ప్రణీతను 6-4, 6-4 స్కోర్‌తో ఓడించి విజయం సాధించింది. ఈ సందర్భంగా శనివారం సాయిఅనన్యను పలువురు అభినందించారు.

బహుజన వాదం రాజకీయ ఉద్యమంగా మారాలి

● బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ముషీరాబాద్, జనవరి 27: బహుజన వాదం బలమైన రాజకీయ ఉద్యమంగా మారితేనే బడుగులకు రాజ్యాధికారం దక్కుతుందని బీఎస్‌పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ 30వ ఆవిర్భావ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాధికారంతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా న్యాయం జరుగుతుందని, ఆధిపత్య పార్టీలకు ఓట్లు వేసి నంతకాలం బహుజనుల బతుకులు మారవనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పికట్ల భరత్ భూషణ్, ప్రొఫెసర్ ముత్తయ్య, ఇటిక్యాల పురుషోత్తం, నతానియల్, కనకయ్య, జూపాక సుభద్ర, పల్లర్ల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మెగా జాబ్ మేళా

అబిడ్స్,జనవరి 27: డెక్కన్ బ్లాస్టర్స్ చైర్మన్ మన్నాన్‌ఖాన్ అధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ జాబ్ మేళాలో కనీసం 10వ తరగతి పాసైన వారితో పాటు ఇతర ఉన్నత విద్యార్హతలు ఉన్న వారు పాల్గొనవచ్చని అన్నారు. 30 జనవరి మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెహిదీపట్నంలోని ఎంపీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8374315052 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో వృద్ధుడు మృతి

కాచిగూడ, జనవరి 27: గుండెపోటుతో వృద్ధుడు చెందాడు. కాచిగూడ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంకోటిలోని ప్రగతి సొసైటీ ప్రాంతానికి చెందిన కీలు సీతారసికలాల్(65)శనివారం భోజనం చేయడానికి కాచిగూడలోని వుడ్‌సైడ్ హోటల్‌కు వచ్చాడు. భోజనం చేసి తిరిగి ఇంటికి వెళ్లడానికి పార్కింగ్‌లో ఉన్న తన ద్విచక్ర వాహనం దగ్గరకు వచ్చాడు. అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. హోటల్ యాజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడికి గతంలో రెండు స్టంట్లు వేశారని, కేసు దర్యాప్తు ఉందని పోలీసులు తెలిపారు.

సంస్కృతి కళాధార, సంస్కృతి కళాతరంగిణి సంయుక్తాధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణం ఆడిటోరియంలో శనివారం నాట్యం, నృత్యం, సంగీతం, వాయిద్యం తదితర కళా ప్రదర్శనలతో చిన్నారులు అలరించారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్, నటులు సురేశ్, కొరియోగ్రాఫర్ భరత్, నిర్వాహకుడు డాక్టర్ కల్యాణశాస్త్రి పాల్గొని ప్రశంసా పత్రాలను ప్రదానం చేసి చిన్నారులను అభినందించారు. – తెలుగు యూనివర్సిటీ, జనవరి 27

యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు కృషి

● తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం చైర్మన్ పాడిశెట్టి నర్సింగ్‌రావు

సుల్తాన్‌బజార్, జనవరి 27: మేరు కులస్థులకు చెందిన యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది క్రికెట్ లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం చైర్మన్ పాడిశెట్టి నర్సింగ్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం నిజాం కళాశాల మైదానంలో తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'మేరు క్రికెట్ లీగ్ సీజన్-2'ను సంఘం మాజీ అధ్యక్షుడు పెండ్యాల చంద్రమోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ క్రికెట్ లీగ్‌తో మేరు కులస్తులను ఏకం చేసి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి మరింత ప్రోత్సాహాన్ని అందించాలనే ఈ లీగ్‌ను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 21 టీంలు పాల్గొంటున్నాయని, ఈ లీగ్‌లో ఆడిన వారితో పాటు విజేతలైన వారందరికీ తగిన నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు జి.అరుణ్ కుమార్, శ్రీపతి సూరజ్, రాపర్తి రవికుమార్, పెండ్యాల గిరిధర్, మంతపురం శ్రావణ్‌కుమార్, కుంటమల్ల లక్ష్మీనారాయణ, శేఖర్ వోడల, ఫణీంద్ర భార్గవ్, కీర్తి వినయ్, బషీటి కుమార్, కర్నే ధరణి, కేవీ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాల మైదానంలో మేరు క్రికెట్ లీగ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మేరు సంఘం చైర్మన్ పొడిశెట్టి నర్సింగ్‌రావు, సంఘం మాజీ అధ్యక్షుడు పెండ్యాల చంద్రమోహన్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ చిత్రకారుడు రావూరి సభాష్‌బాబు

'వెంకట రమణ వ్యాసాల సంపుటి' ఆవిష్కరణ

కవాడిగూడ, జనవరి 27: సమాజ మార్పునకు చిత్రకళ దోహదం చేస్తుందని ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబు అన్నా రు. ఈ మేరకు శనివానం సుందరయ్య విజ్ఞా న కేంద్రంలో ఎల్.ఆర్.వెంకటరమణ వ్యాసాల సంపుటి కళా ప్రపంచం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో పోరాటాలను చిత్త ప్రసాద్ బొమ్మలు రికార్డు చేశాయని అన్నారు. తోట వైకుంఠం, సూర్యప్రకాశ్ వంటి వారు తెలంగాణ గ్రామీణ ప్రకృతిని తమ బొమ్మలలో చూపారని అన్నారు. అనంతరం తెలంగాణ సాహిత్య కార్యదర్శి కే ఆనందచారి మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారులను పరిచయం చేసిన ఈ పుస్తకాన్ని కవులు, రచయితలు కళాకారులు తప్పక చదవాలని అన్నారు.

ప్రముఖ కవి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. టాగోర్, పికాసో, సాల్వడార్‌డాలీ వంటి వారిని పరిచయం చేసిన ఈ పుస్తకం సిలబస్‌లో పెట్టాలని అన్నారు. చిత్రకారులను గురించి కూరెళ్ల శ్రీనివాస్ ప్రసంగించారు. ఈ సభకు డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహించారు.

తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర, రంగస్థల అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం రాత్రి శ్రీకృష్ణ రాయబార ఘట్టాన్ని పలువురు కళాకారులు ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా కళాకారులతో పాటు సంఘసేవకులు మహేశ్వరం అంబదాసు దంపతులను నిర్వాహకులు గూడ రామకృష్ణ, పరమేశ్వర్ లు సత్కరించారు. – తెలుగు యూనివర్సిటీ, జనవరి 27

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మెహిదీపట్నం జనవరి 27 : సజ్జిమండిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఐఎం పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్,కార్పొరేటర్ జాకీర్ బాక్రితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని అన్నారు.

● నుమాయిష్ జోష్

జనవరి 26 సెలవుతో పాటు శనివారం వారాంతం, మర్నాడు ఆదివారం సెలవు కావడంతో నాంపల్లిలో ఏర్పాటు చేసిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు శనివారం రోజు రాత్రి భారీ సంఖ్యలో సందర్శకులు హాజరయ్యారు. నుమాయిష్‌లోని వివిధ స్టాళ్లతో పాటు మార్కెట్‌లోకి వచ్చిన నూతన వస్తువుల గురించి తెలుసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఈ సందర్భంగా అమ్యూజ్‌మెంట్ పార్కు, తదితర స్టాళ్ల వద్ద సందర్శకుల తాకిడి భారీగా కనిపించింది. – అబిడ్స్, జనవరి 27